# మాస్టర్ సి.వి.వి.

అందరికీ అమరత్వం, అందరికీ బ్రహ్మత్వం అని సంకల్పించిన రాజయోగి



# ముందుమాట

బొమ్మలకీ, రంగులకీ, కథలకీ, పుస్తకాలకీ బాల్యంతో ఒక విడదీయలేని సంబంధం ఉంటుంది. అప్పుడే వికసిస్తున్న మనసులకి ఆలోచనలను, ఊహలను, కలలను, సృజనాత్మకతను పరిచయం చేస్తాయి. నీతికథలు, చారిత్రక కథలు, విలువలని అందించే కథలు, వ్యక్తిత్వాన్ని పెంపొందించే కథలు, రామాయణ, భారత, పురాణాల కథలు వారి జీవితాలపై చెరగని ముద్ర వేస్తాయి.

చందమామ, అమర చిత్ర కథ పుస్తకాలు మొదలైనవి కొన్ని తరాలుగా పిల్లలను చైతన్యపరుస్తూ ఆకట్టుకుంటూ ఉన్నాయి.

అదే కోవలో పిల్లలకు మాస్టర్ సి.వి.వి, మాస్టర్ ఎం.ఎన్. మాస్టర్ ఇ.కె. వంటి మహాత్ముల జీవితాలను కథల పుస్తకం రూపంలో పరిచయం చేయడానికి ఒక వినయపూర్వకమైన ప్రయత్నం చేస్తున్నాము. వారి జీవిత సంఘటనలను వివరించడంగా మాత్రమే కాక, వారి బోధనలలో ఆచరణ సులభమైన చిన్ని చిన్ని విషయాలను జోడించి వారి దివ్య జీవితం మనకు ఏ రకంగా అనుసరణీయమో తెలియజెప్పటం ధ్యేయంగా జీవితకథలు రూపొందించబడ్డాయి.

ఈ జీవిత చరిత్రను పిల్లలు సులభంగా అర్థం చేసుకునేలా తయారు చేయడంలో సృజనాత్మక స్వేచ్ఛ తీసుకోబడింది. మా ఈ ప్రయత్నం పిల్లల అవగాహనకు ఎంతో దోహదపడగలదని విశ్వసిస్తున్నాము.

ఈ పుస్తకాన్ని సిద్ధం చేయడంలో విషయ సేకరణ, ప్రూఫ్ రీడింగ్, అనువాదము, ధన సహాయములతో సహకరించిన సోదర బృందమునకు మా కృతజ్ఞతలు.

**డాక్టర్ కె. పార్వతీకుమార్ గారి రచనలు, ప్రవచనాల ఆధారంగా ఈ పుస్తకాన్ని సంకలనం చేశాము.**

విషయ సేకరణకై పరిశీలించిన ఇతర గ్రంథములు:
1. మాస్టర్ సి.వి.వి. - రచన: మాస్టర్ ఇ.కె.
2. ప్రాక్పశ్చిమములు - రచన: మాస్టర్ ఇ.కె.
3. ప్రేమ లేఖలు - రచన: మాస్టర్ ఇ.కె.
4. మాస్టర్ ఇ.కె. జీవిత చరిత్ర - రచన: శ్రీ సి.హెచ్. సత్యదేవ్
5. అనంతపుత్రుని అనంత వైభవం - రచన: శ్రీ యు.వి.ఏ.ఎన్. రాజు

**చిత్రకారుడు**
ఆర్టిస్ట్ కట్టిబోయిన శ్రీనివాస్

**విలువ**
అమూల్యం


**ప్రచురణ**
ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ - గ్లోబల్, స్విట్జర్లాండ్.


**సర్వహక్కులు**
© 2025, ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ - గ్లోబల్, స్విట్జర్లాండ్.

ఈ ఎలక్ట్రానిక్ పుస్తకం https://worldteachertrust.org/en/web/publications లో ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంది.

జ్ఞానమనే దీపాన్ని చీకటి ఆవరించే ప్రమాదం వచ్చినప్పుడల్లా, దైవత్వం గురువుగా దిగివచ్చి మానవాళికి దారి చూపుతుంది. గురువులు ప్రతిసారీ భూమి పై అవతరించి దైవత్వానికి చేరే సాధనంగా మానవాళికి సేవ చేస్తారు. అటువంటి పరిపూర్ణ జీవితాన్ని గడిపిన మాస్టర్ సి.వి.వి. గారి కథ ఇది, ఇందులోని ప్రతి అంశమూ ఆయన నడచి చూపిన యోగ మార్గానికి నిదర్శనం.

మాస్టర్ సి.వి.వి. 1868 ఆగస్టు 4 న దక్షిణ భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని ప్రసిద్ధ దేవాలయ పట్టణం కుంభకోణంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు శ్రీ కుప్పుస్వామి అయ్యంగార్, శ్రీమతి కామమ్మ. పుట్టిన పదకొండవ రోజున ఆ బిడ్డకు కంచుపాటి వెంకటరావ్ వెంకాస్వామిరావ్ అని నామకరణం చేశారు.







** థియోసాఫికల్ సొసైటీ, (భారత దేశం, మద్రాసులో ప్రధాన కార్యాలయం). విశ్వవ్యాప్త సోదరభావమును, ప్రపంచమందలి పవిత్ర గ్రంథముల జ్ఞానమందలి ఏకత్వమును పరిచయం చేసిన సంస్థ.*

వీరికి పన్నెండేళ్ళ వయసులో శ్రీ రుక్మిణమ్మ తో వివాహం జరిగింది, ఆమె ద్వారా ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు జన్మించారు.  మాస్టర్ గారి ముప్పై ఆరేళ్ల వయసులో ఆమె కన్నుమూశారు.



వీరి ముప్పై ఎనిమిదవ ఏట శ్రీ వెంకమ్మ గారిని వివాహం చేసుకోగా ఆమె ద్వారా ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. వారి జీవితంలోకి వెంకమ్మగారి రాక మానవాతీతశక్తులను అధ్యయనం చేసే దిశలో మరో ముఖ్యమైన మైలురాయి. విశ్వ విజ్ఞానాన్ని వెలికితీసే క్రమంలో శాస్త్రీయ, ఆధ్యాత్మిక ప్రయోగాలను నిర్వహించడానికి ఒక మాధ్యమంగా ఆమె వారికి ఎన్నో సేవలందించారు.






ఆర్ధికంగా అనేక వ్యాపారాల ద్వారా పట్టణంలో సంపాదించిన ఆస్తులను అవసరాలలో ఉన్నవారిని ఆదుకోవటానికి ఆయన వినియోగించేవారు. వారింట అల్పాహారం మొదలుకొని 12 నుండి 16 రకాల పదార్ధాలతో మధ్యాహ్నభోజనం, రాత్రిపూట విందుతో ప్రతిరోజూ ఒక పండుగ వాతావరణం ఉండేది.



సంగీతంలో వారికి ఉన్న ప్రావీణ్యం అమోఘం. ఆయన కావేరి నది తీరంలో పాడుతుంటే, అనేకులు ఆయన గానానికి మంత్రముగ్ధులై, మైమరచి ఆయన చుట్టూ చేరే వారు.



వారు పట్టణంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన వ్యక్తి. పట్టణానికి మేయర్‌గా కూడా సేవలు అందించారు. ఏ కారణమూ లేకపోయినా, అనేకులు ఆయన పట్ల ఆకర్షితులయ్యేవారు




వారి 42వ సంవత్సరంలో ఒక అద్భుత సంఘటన జరిగింది. 1910 మార్చి 31న అర్ధరాత్రి హేలీ తోకచుక్క మన సౌర కుటుంబాన్ని తాకింది.




హేలీ తోకచుక్క తోక మన గ్రహాన్ని తాకటంతో ఉరుములు, భారీ మెరుపులతో అర్ధరాత్రి మాస్టారు ఇంట్లో పిడుగు పడ్డట్టు అయినది. అది గమనించిన చుట్టుపక్కల వారు భయభ్రాంతులై ఆయన ఇంటికి పరుగులు తీశారు.




తలుపు తెరిచి చూడగా వీరాసనంలో కూర్చుని ధ్యానంలో నిమగ్నమై ఉన్న మాస్టారి చుట్టూ ప్రకాశవంతమైన కాంతి కనిపించింది. వారు ఆయనను కదిలించే సాహసము చేయలేక వెనుతిరిగారు.





ఇళ్లకు చేరుకుని మరుసటి ఉదయం ధైర్యం చేసి ఆయన వద్దకు వచ్చి మునుపటి రాత్రి ఏమి జరిగిందని అడిగారు.





మాస్టారు ఎన్నో గంటల తరబడి లోతైన సమాధి స్థితిలో కూర్చొని అనేక ప్రయోగాలు చేయగా వారికి భార్య వెంకమ్మ, కుమారుడు చందు, శిష్యుడు సుందరం సహకారమందించారు.



తన భార్య, కుమారుడు, శిష్యుని సూక్ష్మ దేహములతో# పనిచేసి ఉన్నత కక్ష్యలు, లోకముల నుంచి ఎంతో సమాచారాన్ని సేకరించారు. ఎన్నో ప్రయోగాలు చేసి మానవ దేహ నిర్మాణం * అమరత్వాన్ని పొందేలా తీర్చిదిద్దే మార్గాలను కనుగొన్నారు.





తన యోగముతో గ్రహ గతులను చక్కచేసి వాటికి కొన్ని సర్దుబాట్లు చేశారు.




విశ్వ తరంగములతో ప్రయోగాలు చేసి మనిషి మనస్సును సమర్ధవంతంగా సరిదిద్దడానికి కొన్ని శబ్దతరంగములు రూపొందించారు.








# మానవ శరీరం భౌతిక శరీరం, సూక్ష్మ శరీరం అనే రెండు భాగాల సమ్మేళనం, ఈథరిక్ బాడీ ని సూక్ష్మ శరీరం అంటారు.

* మానవ దేహ నిర్మాణంలో ఏడు కక్ష్యలు ఉన్నాయి.



వెంటనే ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది హిందూ'లో "మరణాన్ని దాటగోరువారు సంప్రదించగలరు" అని ప్రకటననిచ్చారు. అది చూసిన కొందరు వారిని పిచ్చివాడిగానూ, మరికొందరు ఇందులో ఏదో మర్మమున్నది అని భావించారు. వివేకవంతులు మాత్రం అర్థం చేసుకుని అనుసరించారు.
THE HINDU
తెలుసుకుందామనుకునే వారు, సత్యాన్వేషకులు ఈ ప్రకటనకు ప్రతిస్పందించి ఈ కొత్త యోగాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన చుట్టూ చేరారు.
ఇది నిజమా? అమరత్వానికి మీకు మార్గం తెలుసా?
ముమ్మాటికీ. అదే నా వాగ్దానం, నా యోగాన్ని అనుసరిస్తే శరీరాన్ని విడిచినా మీకు మరణం లేదు.
అద్భుతం! ఈ యోగం పేరేమిటి? ఏమిటి దీని ప్రత్యేకత?
భృక్త రహిత తారక రాజయోగం. గత జన్మకర్మను రహితం చేసి, కుంభ చైతన్యమును అనుభూతి చేయించటమే ఈ యోగం ప్రత్యేకత.
మా గత జన్మ కర్మను నిర్వీర్యం చేయడం మీకెలా సాధ్యం? మన కర్మను శని, ఇతర గ్రహాలు శాసిస్తున్నాయి కదా?






*# ప్రతి పనికి దాని ఫలితం ఉంటుంది అనీ, ప్రతి మనిషి పుట్టుక అతని పూర్వ జన్మలోని పనుల ద్వారా నియంత్రించబడుతుందని అదే కర్మ అని భారతదేశంలో నమ్ముతారు.*



.. కానీ నాకు నా స్నేహితుడికి ఒక సంబంధము, ఒక అవగాహన ఉంది కాబట్టే సాయం...
నేను కూడా అంతే. నాకు కూడా ఈ గ్రహాలతో అవగాహన ఉంది. వారితో నాకు "ఒప్పందాలు" ఉన్నాయి.
ఎవరైనా నా యోగాన్ని అనుసరిస్తే, నేను అతని బాగోగులు చూసుకుంటాను.
ఇది మునుపెన్నడూ లేనిది. ఇదేమైనా కొత్త యోగమా?
నిజమే, ఇది కుంభ యుగానికి చెందిన యోగం.
దీనికి నియమాలు ఉన్నాయా? ఇది పాటించటం కష్టమా?
ఏమాత్రం కాదు. ఇది చాలా తేలిక!
ఈ కుంభ చైతన్యాన్ని స్వీకరించి అందరికీ అందించడానికే నేను దిగి వచ్చాను.
రేపు, మే 29న ఈ యోగం గురించి వివరిస్తాను.
ఆసక్తి కలవారు స్నానాదికములు పూర్తిచేసుకుని ఉదయం 6 గంటల లోపు వచ్చి ఉపదేశమందుకొనవచ్చు.
ఇకపై మే 29వ తేదీ “మాస్టర్ మే కాల్ డే ““ (ఉపదేశ దినం)గా పిలువబడుతుంది.

మరుసటి రోజు ఉదయం 5:00 గంటలకు మాస్టారు ఇంటి వద్ద సుమారు 100 మంది సమావేశమయ్యారు. మాస్టర్ గారు అందరికీ ఇడ్లీ సాంబార్ తో అల్పాహారం ఏర్పాటుచేశారు. ఆ రోజుల్లో ఉన్న సంప్రదాయ నిబంధనలకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ప్రజలు శుభదినాల్లో ఉపవాసం పాటించేవారు, కాని ఈ గురువుగారు ఆ నియమాన్ని ఉల్లంఘించటంతో యోగ ప్రవేశం చేయించారు. అల్పాహారం ముగిసిన వెంటనే, ఉదయం 5:50 నిముషములకు హాలులోనికి రాగా ఉత్తరము లేదా తూర్పు ముఖంగా సుఖంగా కూర్చోవాలని మాస్టర్ వారికి సూచించారు.





అటుపై మీ గురువును ఆ కమలం మధ్యలో కూర్చున్నట్లుగా దర్శించండి. గురువుగారు చిరునవ్వుతో, ఆశీర్వాద ముద్రతో మీ కళ్ళలోకి చూస్తున్నారని భావించండి. మాస్టారుని భావన చేస్తూ 'నమస్కారం మాస్టర్ సి.వి.వి.' అని ఉచ్చరించి 15 నిమిషాలు మౌనంగా ఉండండి.
నమస్కారం మాస్టర్ సి.వి.వి.
నమస్కారం మాస్టర్ సి.వి.వి.
వారు 6 గంటలకు ప్రార్థననివ్వగా అందరూ అనుసరించారు. అలా ఎంతసేపు ప్రార్థనలో కూర్చున్నారో ఎవరికీ తెలియదు.
మెల్లమెల్లగా ప్రజలు కళ్ళు తెరవడం ప్రారంభించారు. వారు అనుభవించినది మాటల్లో వివరించలేనిది అని గుర్తించారు.
"ఇది మనలో శక్తిని మేలుకొలిపే ప్రార్థన. దీన్ని 12 గంటల విరామంతో రోజుకు రెండుసార్లు చేయాలి.
ఇన్వోకేషన్ 12 గంటల పాటు పనిచేస్తుంది.
దినచర్యలో క్రమబద్ధం గా సాగడానికి అనుకూలమైన సమయాన్ని ఎంచుకోండి. ఉదయం, సాయంత్రం దానికి కట్టుబడి ఉండండి.








డిసెంబర్ 29న జరిగే డిసెంబర్ కాల్ లో ప్రత్యక్ష మీడియం లతో మాస్టర్ సి.వి.వి. గారు.


ప్రార్థన చేసిన వెంటనే, ప్రతి ఒక్కరి మనస్సులో అనేక ప్రశ్నలు ఉంటాయని  తెలుసు కాబట్టి, ప్రశ్నోత్తరాల సమావేశంను ప్రారంభించారు.






ఈ ప్రజ్ఞ మన గ్రహాన్ని సందర్శించడం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?"
సూక్ష్మ శరీరాన్ని నిర్మాణం చేసి తద్వారా మరణాన్ని జయించి అమరత్వాన్ని సాధించిపెట్టడానికి ఈ కుంభ చైతన్యం దిగి వచ్చింది.
అంటే, ఈ దేహంలో మనం ఎప్పటికీ ఇలాగే ఉంటామా?
లేదు, మీరు ఈ శరీరంలో ఉన్నప్పుడు మీ సూక్ష్మ శరీరం నిర్మించడంలో నేను మీకు సహాయం చేస్తాను.
ఈ సూక్ష్మ దేహం (ఈథరిక్ బాడీ) అంటే ఏమిటి?
సులభంగా చెప్పాలంటే, ఇది ఒక కాంతిమయ శరీరం.
అయితే మన శరీరం ఏమిటి?
పదార్థమయ శరీరం.


పదార్థమయ శరీరం కాంతి శరీరంగా ఎలా రూపాంతరం చెందుతుంది?
ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో క్రమం తప్పకుండా ప్రార్థన చేస్తూ లోపల ఏమి జరుగుచున్నదో గమనించడం ద్వారా ఇది సాధ్యమౌతుంది.



ఈ కొత్త యోగం సాంప్రదాయక ఆచారాలకు విరుద్ధంగా, నూతనంగా ఉన్నది, ముఖ్యంగా ఆంగ్లంలో ఉన్నది. ఎందుకు?
నిజమే, ఈ చైతన్యం మొత్తం విశ్వమంతా వ్యాపించి సృష్టి పరిణామాన్ని వేగవంతం చేయడానికి సహాయపడుతుంది.
ఇది ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితమైనది కాదు. ఇది విశ్వజనీనమైనది. అందుకే ఆంగ్ల మాధ్యమంగా ఇవ్వబడింది.



CELESTINE
AMBER
COLEMINE
BRUCITE
APATITE
CHALCOCITE
AMETHYST
RUBY
OXIDES
SMITYSONITE
సృష్టి పరిణామానికి సహాయం చేయడానికా? అంటే మానవ పరిణామమా?
కుంభ చైతన్యము మానవుల పరిణామానికి మాత్రమే కాదు, ఖనిజములు, వృక్షములు, జంతువులు, చివరకు గ్రహముల శీఘ్ర పరిణామానికి దోహదం చేస్తుంది.
మీరు నన్ను గుడ్డిగా నమ్మడం నాకిష్టం లేదు.
మీరు చెప్పేదాన్ని మేము ఎలా నమ్మగలము?
నేను మీ విశ్వాసాన్ని కోరడం లేదు. ఇది ఒక శాస్త్రం. మీరు దానితో ప్రయోగాలు చేసి ఫలితాలను చూసుకోవచ్చు.









మొదటి ప్రార్థనకు హాజరైన కొందరు ఈ సాధనను కొనసాగించగా, కొందరు విరమించుకున్నారు. కొందరికి కొన్ని సందేహాలు, మరికొందరికి క్రమం తప్పకుండా చేయాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ ఏవో కొన్ని అడ్డంకులు. ఒక రోజు, మాస్టారు కావేరి నది ఒడ్డున నడుస్తున్నప్పుడు, కొంతమంది సందేహాలు తీర్చుకోవడానికి వారిని అనుసరించారు.


మాస్టర్, మీరిచ్చిన యోగం పురుషులకు మాత్రమేనా?
ఇది స్త్రీపురుషులిద్దరికీ వర్తిస్తుంది
ఈ యోగం చేయడానికి వైవాహిక సంబంధం లేదా కుటుంబ జీవితం అడ్డంకా?
ఇది వేరు చేసే మార్గం కాదు. ఈ యోగానికి వృత్తి, వివాహం మరియు కుటుంబ బాధ్యతలు ఆవశ్యకమైనవి.
మాస్టర్, నేను ప్రార్థనలు చేయాలనుకుంటున్నాను, కానీ నా అనారోగ్యం అడ్డంకిగా మారింది. ఇంతకు ముందు ఎప్పుడూ నాకు ఇంతటి అనారోగ్యం లేదు.
కంగారు పడకు. ఏళ్ల తరబడి మీరు కూడబెట్టిన గత కర్మను నేను తొలగిస్తున్నాను. ప్రార్థనలతో స్థిరంగా ఉండండి, మీరు ఆరోగ్యాన్ని తిరిగి పొందుతారు.
నేను బలహీనుడను, ప్రార్థన సమయంలో కూర్చోలేకపోతున్నాను.
మీరు ప్రార్థన సమయంలో కూర్చోలేకపోయినా, మానసికంగా నాకు సమర్పణ చేసుకోండి, నేను మీకు కావసినంత **ప్రాణ శక్తి**నిస్తాను.



నేను మరచిపోకుండా ఉండటానికి ప్రతి ఒకటి లేదా రెండు గంటలకు ఒకసారి సి.వి.వి నామం జపిస్తే మంచిదా?
మీరు లైట్ కింద పని చేయాలనుకుంటే, మీరు లైట్ స్విచ్ ను పదేపదే ఆన్ చేస్తారా, లేదా ఒక్కసారి మాత్రమే ఆన్ చేస్తారా?
ఒక్కసారే.
కదా !. అదేవిధంగా, మాస్టర్ ప్రజ్ఞను అందుకోడానికి సి.వి.వి. నామం కూడా ఒక స్విచ్. మీరు ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి ఉచ్చరిస్తే సరిపోతుంది, కానీ రోజంతా అది చేయవలసిన పని చేస్తుంది.
రోజంతా ఈ చైతన్యాన్ని గుర్తుంచుకోవడానికి తేలికైన మార్గం ఉందా?
లేకేమి ? మీ చుట్టుపక్కల ఉన్న అన్ని జీవులలో నన్ను గమనించండి. అందరిలో నన్ను గుర్తుచేసుకోండి.
భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు చెప్పినదీ, నారద మహర్షి ధ్రువునికి చెప్పినదీ ఇదే కదా- భగవంతుడినీ అన్నింటిలో, గడ్డిలో, పువ్వులో, ప్రవహించే నీటిలో, జంతువులో, మన చుట్టూ ఉన్న ప్రతిదానిలోనూ చూడమని. ఎంత బాగున్నదో.
మాస్టర్ గారు అత్యంత ప్రాచీనమైన యోగ జ్ఞానాన్ని ఆధునిక యుగానికి తగిన రీతిలో అందిస్తున్నారని అక్కడున్న వారంతా ముగ్ధులయ్యారు.


ప్రార్థన ఎలా చేయాలో నాకు తెలియదు. మరి నువ్వు నాకు సాయం చేస్తావా తాతయ్యా?
ఓ ! తప్పకుండా. నువ్వు నిద్రపోయే ముందు, ' మాస్టారు, దయచేసి నా లోపల సరిదిద్ది నన్ను అభివృద్ధి చేయండి' అని చెప్పుకుని పడుకో. నువ్వు నిద్ర పోతున్నప్పుడు నీలో రావలసిన మార్పులు నేను చూసుకుంటాను.
మాస్టారూ, నేను ఒప్పుకోక తప్పదు, నేను కొన్ని రోజులు ప్రార్థించగలిగాను, కానీ ఆ తరువాత వీలే కావడంలేదు. ఎందుకో తెలీదు.
మీ ఇష్టానుసారం ప్రార్థించవచ్చని అనుకోవద్దు. నేను అనుమతిస్తేనే మీరు ప్రార్థించగలరు.
మీరు ఇంతకు ముందు అనుమతించి ఇప్పుడు ఎందుకు నిరాకరించారు?
నేను ప్రతి ఒక్కరినీ వారి జీవితంలోని అన్ని కోణాలలో గమనిస్తాను. అన్ని సందర్భాలలో వారి ప్రవర్తనను బట్టి నా అనుమతి లభిస్తుంది.




మీరు నా యోగమార్గంలో పని చేయాలనుకుంటే, మీ కోసం ఏమీ కోరుకోకండి. మీ గురించి ఆలోచించడం మానేసి ఇతరుల కోసం పని చేయడం ప్రారంభించండి. సహాయం చేయాలనే తపనతో ముందుకు సాగాలి.
మళ్లీ నేను అర్హతను ఎలా పొందగలను?
మరి మా జీవిత అవసరాల మాటేమిటి?
మీరు ఇతరుల అవసరాలు గమనిస్తూ ఉంటే నేను మీ అవసరాలు చూసుకుంటాను అనే నమ్మకం కలిగి ఉండండి.
రోజులు గడుస్తున్న కొద్దీ ఈ మాట వ్యాపించి దూర ప్రాంతాల నుంచి వచ్చి ఎందరో మాస్టర్ యోగంలో ప్రవేశించారు. పేరుకు తగ్గట్టుగానే యోగా ఫ్రెండ్స్ స్కూల్ సొసైటీ జీవ పరిణామమునకు ఒక కేంద్రంగా మారింది.
SCHOOL
మాస్టర్ వివిధ ప్రయోజనాల కోసం వేర్వేరు కోర్సులను ఇచ్చారు. ఇటువంటి కోర్సులు చాలావరకు ఆంగ్లంలో "మిస్టిక్ మంత్రాలు" గా ప్రసిద్ధి చెందాయి. ఆంగ్లంలో మంత్రాలు ఎందుకు ఇస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే:
మనసు ఎప్పుడూ కొత్త విషయాల పట్ల ఆసక్తి పెంచుకుంటుంది. ఇంతకు ముందు తెలిసిన వాటిని వదిలేస్తుంది. ఈ యోగమార్గంలో సారాంశం కొత్తదేమీ కాకపోయినా, అసక్తి కలగడానికి, మార్పుకి నాంది పలకడానికి ఆంగ్ల భాషలో ఇచ్చాను.


మాస్టర్ సి.వి.వి. మార్గదర్శకత్వం కోరే అందరు వాహికల (మీడీయమ్స్) తో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించేవారు. ప్రత్యేక కోర్సులు, ప్రార్థనలు సర్దుబాట్లపై సూచనలు అందించేవారు.





డిసెంబరు 29, మే 29 తేదీల్లో, విషువత్ దినములు, దక్షిణాయన ఉత్తరాయణ సంక్రమణములు మొదలైన రోజులలో యోగ సమావేశములు నిర్వహించేవారు.



నిరంతర యోగ సాధన ద్వారా సూక్ష్మ శరీరంగా పిలువబడే బంగారు శరీరం, కారణ శరీరంగా పిలువబడే వజ్ర శరీరాన్ని నిర్మించడం సాధ్యమని, అమరత్వానికి మార్గాన్ని వెల్లడించారు.



అటువంటి కాంతిమయ బంగారు శరీరంతో రోగం, మరణం వంటి శారీరక పరిమితులను అధిగమించడం సాధ్యమని, తమ శరీరాన్ని వదిలి కొన్ని రోజుల తర్వాత తిరిగి జీవించటం ద్వారా వారు నిరూపించారు.




ఒకమారు వారు దేహం విడిచి వెళ్ళినప్పుడు చుట్టుపక్కల వారు ఆయన ఇక లేరని భావించారు కానీ కొన్ని రోజులలో సజీవంగా రావడం చూసి ఆశ్చర్యపోయారు. ఇదే ప్రక్రియను 18 సార్లు పునరావృతం చేసి "అందరికి అమరత్వం, అందరికి బ్రహ్మత్వము" అనే వాగ్దానాన్ని నిరూపించారు.




మాస్టర్ సి.వి.వి. గారు 1922 మే 12 న దేహత్యాగం చేసి అంతర్యామిత్వం చెందారు. ఇప్పటికీ యోగమార్గానికి సమర్పణ చెందిన వారందరికీ, తన సాన్నిధ్యాన్ని అనుగ్రహిస్తూనే ఉన్నారు.




12 సంవత్సరాల పాటు యోగాన్ని ఆచరించిన ప్రతి ఒక్కరూ దివ్యమైన శరీరాన్ని పొందుతారని మాస్టర్ సి.వి.వి. గారు వాగ్దానం చేశారు. శ్రీ పోతరాజు నర్సింహం, మాస్టర్ ఎం.ఎన్., మాస్టర్ వి.పి.ఎస్, మాస్టర్ ఇ.కె., శ్రీ కొత్త రామ కోటయ్య గారు, మాస్టర్ కె.పి.కె. మొదలైన ఎందరో మీడియమ్స్ జీవితాలు ఆ వాగ్దానానికి ఉదాహరణలు. ఎందరో సత్యాన్వేషకులు ఈ మీడియమ్స్‌ను అనుసరించి, మాస్టర్ సి.వి.వి. యోగమార్గాన్ని నేటికీ వ్యాప్తి చేస్తున్నారు.







సి.వి.వి. యోగాన్ని అనుసరించేవారిలో, మైనంపాటి జ్వాలా నరసింహం గారు (మాస్టర్ ఎం.ఎన్.) ఒక ధ్రువతార గా నిలిచి యోగ వ్యాప్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి, అనేక మంది శిష్యులకు మార్గనిర్దేశం చేశారు.
మూడేళ్ల స్వల్ప వ్యవధిలోనే తల్లిదండ్రులను, మామగారిని, తమ్ముడిని కోల్పోవడంతో నరసింహం గారు తీవ్ర మనస్తాపానికి, నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు.
ఆంధ్రకేసరిగా పేరొందిన శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి మేనల్లుడు శ్రీ నరసింహం, ఒంగోలులో న్యాయవాది వృత్తి చేసేవారు.
భేషుగ్గా, నాకు తెలిసిన గురువు గారు మరణాన్ని ఎలా దాటాలో తెలుసుకోవడమే కాకుండా దానికి తేలికైన దారి కూడా నడిచి చూపించారు.
నాకు జీవితం మరణం రెండూ అర్థం కావు. మనిషి మరణాన్ని దాటగలడా?
మద్రాసులో ఉంటున్న తన రెండవ మేనమామ అయిన డాక్టర్ జానకిరామ్ గారిని 1919 లో కలుసుకుని తాను పడుతున్న వేదనను, బాధను పంచుకున్నారు శ్రీ నరసింహం.


డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ మాస్టర్ సి.వి.వి. గారు గ్రహగతులనూ పరిశీలించగలరనీ, వాటి పరిమితులను సరిదిద్ది, జీవులను ప్రగతి పథంలో నడిపించ గలరనీ తెలిపారు.
డిసెంబర్ కాల్ సమావేశాలు ఈ నెల 29న జరుగనున్నాయి. తక్షణమే మనం కుంభకోణం బయలుదేరుదాం.
ఈ యోగం లోనికి నేనెప్పుడు ప్రవేశించగలను? మాస్టరు గారిని నేనెప్పుడు దర్శించుకోగలను?
డాక్టర్ జానకిరామ్, ఎం.ఎస్.లు కుంభకోణం చేరుకున్నారు. వారు యోగా స్కూల్ ఫ్రెండ్స్ సొసైటీ చేరే సరికి గుమ్మం వద్ద మాస్టరుగారు ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్లు నిలుచుని ఉన్నారు. మాస్టారికి అప్పటికే డాక్టర్ జానకిరామ్ పరిచయం కాబట్టి చిరునవ్వుతో శుభ ాంక్షలు తెలిపి ఎం.ఎస్. గారి వైపు చూసి నవ్వుతూ:
ఏమి ఆశించి వచ్చావు?
నేను శాంతి కోరి వచ్చాను.
అనుగ్రహించాను! లోనికి రా.
ఎం.ఎస్. గారు ఇన్నాళ్లూ అనుభవించిన వేదన, బాధలన్నీ తక్షణమే మాయమైపోయి, గుండెల్లో ఎంతో ప్రశాంతత, ఆనందం కలిగింది. మాస్టర్ సి.వి.వి. గారు ఎం.ఎస్.గారి కి మాస్టర్ యోగం లో ప్రవేశం కల్పించి మీడియం నంబర్ 666 ఇచ్చారు.


ఎం.ఎన్ గారు ప్రార్థనలు చేయడం ప్రారంభించిన కొద్దికాలంలోనే వారితో ప్రార్థనలలో పాల్గొన్న అనేక మంది శిష్యుల దీర్ఘకాలిక రోగాలు నయమయ్యాయి. 1919 నుండీ ప్రారంభించి పూర్తి నిబద్ధతతో మాస్టర్ యోగాన్ని అనుసరిస్తూ, 1921 నాటికల్లా ఎంతో ప్రగతిని సాధించిన ఎం.ఎన్. గారు రానున్న రోజులలో మాస్టర్ కాగలరని గమనించిన సి.వి.వి. గారు ఆయనను “లిటిల్ మాస్టర్ “ అని సంబోధించేవారు.




1927 మార్చి 21 న, తమ స్వంత ఇంటిలో సత్య యోగా స్కూల్ స్థాపించి, "ప్రాణమును సరిదిద్దుట, యోగమును  బోధించుట" అను రెండింటితో తమ జీవితకాలంలో సుమారు 1200 మీడయం లకు యోగమార్గం అందిచ్చిన ప్రతిభావంతులు శ్రీ ఎం.ఎన్. గారు.




తన యోగమార్గం ఐరోపా నుంచి దక్షిణ అమెరికా, ఉత్తర అమెరికా, ఆ తర్వాత ఆస్ట్రేలియా మీదుగా భారతదేశానికి వ్యాప్తిచెందుతుందని మాస్టర్ సి.వి.వి. భవిష్యవాణిగా చెప్పారు. మహాసముద్రాలు, ఖండాలను దాటడానికి కుంభచైతన్యం మాస్టర్ ఇ.కె. ను మాధ్యమంగా ఎంచుకోగా, మాస్టర్ ఎం.ఎన్. గారి అదృశ్య హస్తం ప్రాక్పశ్చిమములలోని బృందములకు మార్గనిర్దేశం చేస్తున్నది.


కుంభ చైతన్యము వ్యాప్తికై 1000 వాహికలను తయారు చేస్తానని పలికిన మాస్టరు సి.వి.వి. గారు, ఆ పని చేయడానికి భౌతిక శరీరంలో ఉండటం ఆవశ్యకం కాదు అని మాస్టర్ ఇ.కె. అని ప్రేమగా పిలువబడే డాక్టర్. ఎక్కిరాల కృష్ణమాచార్య గారిని అనుగ్రహించిన సందర్భముగా నిరూపించారు.
మాస్టర్ ఇ.కె. గారు తన 7వ ఏట నుండి గాయత్రి మంత్రంతో గాఢమైన బంధాన్ని కలిగి ఉన్నారు. వేదమాతగా తరచుగా పిలువబడే గాయత్రి దేవి వారికి స్నేహితురాలు, గురువు మరియు మార్గదర్శి కూడా.
విశ్వవిద్యాలయం చేరేనాటికి ఇ.కె. గారి గాయత్రీ ఉపాసన ఉన్నత శిఖరాలకు చేరుకుంది. ఆ రోజుల్లో శాంతి ఆశ్రమానికి వెళ్లి శుక్రవారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు రావి చెట్టు క్రింద కూర్చొని ప్రశాంతంగా గాయత్రి జపించేవారు.


వివాహానంతరం మాస్టర్ ఇ.కె. గారు గుంటూరులో ఇల్లు అద్దెకు తీసుకుని పూజామందిరంలో గాయత్రీదేవి చిత్రపటాన్ని పెట్టుకుని ధ్యానం చేయడం ప్రారంభించారు. ఒక నెల తర్వాత కనులు మూసికొని ధ్యానం చేసేటప్పుడు ఒక వింత దృశ్యం చూడడం ప్రారంభించారు. పట్టుపంచె కట్టుకుని వీరాసనంలో కూర్చుని ఉన్న వ్యక్తి యొక్క శరీరం నడుము నుండి క్రింది భాగం కనబడసాగింది.



ధ్యానం జరుగుతున్నంత సేపు ఆ దృశ్యం స్థిరంగా కొనసాగి రోజురోజుకు స్పష్ట పడసాగింది. కొన్ని రోజుల్లో, క్రింది భాగం ఒక బలమైన, స్థిరమైన వ్యక్తి దేహం; పైభాగం గాయత్రీ మాత యొక్క రూపంగా కనిపించసాగింది.




పై భాగం క్రమక్రమంగా వెల్లడి కాగా, అయస్కాంత శక్తితో, శాంత గంభీర వదనంతో, ఆనందకరమైన రూపమున్న వ్యక్తి ముఖం స్పష్టంగా కనిపించింది.





ఈ క్రొత్త వ్యక్తిని ఎక్కడో చూచినట్లు గుర్తున్నది కానీ వారెవరో కృష్ణమచార్య గుర్తించలేకపోయారు. మౌనంగా తన ధ్యానంలో ప్రవేశించి, మనస్సులో హాయిగా స్థిరపడినట్లు మాత్రం తెలుసుకున్నారు.




మరికొన్ని రోజుల తరువాత శ్రీ రాజగోపాలరావు గారి ఆహ్వానం మేరకు గూడవల్లి గ్రామమునకు వెళ్ళి వారి ప్రార్థనా మందిరంలో ప్రసన్న గంభీరమైన ముఖంతో ఉన్న మాస్టరు సి.వి.వి.గారి చిత్రపటాన్ని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. తనను అనుగ్రహించినది మాస్టర్ సి.వి.వి. గారని తెలిసి వారి యోగంలోనికి ప్రవేశించారు. ఆ క్షణం నుంచి మాస్టర్ ఇ.కె. గారికి సాన్నిధ్యమిస్తూ మాస్టరు సి.వి.వి. గారు నడిపించారు.
PRAYER HALL
అటుపై దివ్యప్రణాళికలో భాగంగా మాస్టర్ సి.వి.వి.కి, హిమాలయ పరంపరకు మధ్య ఉన్న సంబంధాన్ని కూడా గ్రహించగలిగారు.
నిన్ను ఒక గొప్ప పనికై ఎంచుకున్నాను. ఇకపై నీ లోపలి నుండే నీకు బోధిస్తూ ఉండగలను. ధ్యానంలో ప్రతిరోజు నేను సూచించిన విధంగా చేయగలవు
మైత్రేయులు
దేవాపి
మరువు
మాస్టర్ సి.వి.వి.
జ్వాలాకూలుడు
మాస్టర్ జీసస్
తాను అనుసరించిన ఆధ్యాత్మిక మార్గాన్ని పరివ్యాప్తి చేయడానికి జగద్గురువు మైత్రేయుల నామాంకితముగా 1971 నవంబరులో జగద్గురు పీఠమును స్థాపించారు.

సత్యాన్వేషకులకు మార్గదర్శిగా ప్రాక్-పశ్చిమముల మధ్య ఆధ్యాత్మిక వారధి గా మాస్టర్ ఇ.కె. ముఖ్యమైన పాత్ర పోషించారు. హోమియోపతి, జ్యోతిషం, యోగము, వేద పురాణ వాఙ్మయము, మానవ తత్త్వ శాస్త్రములను, ఆధ్యాత్మికతను బోధిస్తూ వాటిని మాస్టర్ సి.వి.వి. యోగముతో జతపరచి వేలాది మందికి కుంభ చైతన్యపు అనుభూతిని ఏర్పరచి నడిపించిన మాస్టర్ ఇ.కె. బహుముఖ ప్రజ్ఞాశాలి.





మాస్టర్ ఇ.కె. గారికి దర్శనమిచ్చిన రూపం వర్ణన ఆధారంగా చిత్రించినది.

**తన చిత్రం పూజించిన**

**ఇంటింటా తానుండి**

**తోడు నీడయై నిలచి**

**ఇహ పరముల సమకూర్చి**

**పరమ గురువు అవతరించె సి.వి.వి.**

(భారతీయ బాలశిక్ష గ్రంథంలోని పాట నుండి.)

# ఆలోచించు, ప్రతిస్పందించు: కథల నుండి పాఠాలు

కథలు కేవలం వినోదానికి పరిమితమయ్యేలా కాకుండా లోతైన అవగాహన అందించాలనే ఉద్దేశ్యంతో కథలోని ముఖ్యమైన విలువలపై దృష్టి పెడుతూ ప్రశ్నలు, సృజనాత్మక కార్యకలాపాలను ఇక్కడ జోడిస్తున్నాము. ఆసక్తి కలిగిన చిన్నారులు స్నేహితులు లేదా తమ కుటుంబ సభ్యులతో కథాంశాలను చర్చించటం ద్వారా కథతో వ్యక్తిగతంగా సంబంధం పెట్టుకోవచ్చు, మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. అర్థం కాని విషయాలను అడిగి తెలుసుకోవచ్చు. ఈ విధంగా ఆచరణకు వీలుగా అనుభవంగా మార్చడానికి ఇది ఒక చిన్ని ప్రయత్నం.

ఈ క్రింద ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.

1. మానవ శరీరం రెండు భాగాల సమ్మేళనంగా ఉంటుంది, అవి

........................................................................................ (పేజీ 6)

2. పదార్థమయ శరీరం కాంతి శరీరంగా ఎలా రూపాంతరం చెందుతుంది?

........................................................................................ (పేజీ 15)

3. మాస్టర్ సి.వి.వి. గారు చేసిన వాగ్దానం ఏమిటి?

........................................................................................ (పేజీ 16)

4. మాస్టర్ సి.వి.వి. గారి యోగం మనలో పనిచేయాలంటే?

........................................................................................ (పేజీ 21)

5. ఈ యోగం పేరు ఏమిటి?

........................................................................................

మీ స్వంత వాక్యాలలో, మాస్టర్ సి.వి.వి. యోగం ప్రత్యేకత ఏమిటి? అది ఎలా పనిచేస్తుందో క్లుప్తంగా (6 వాక్యాలను మించకుండా) వివరణ ఇవ్వండి.

........................................................................................

........................................................................................

........................................................................................

........................................................................................

........................................................................................

........................................................................................

ఈ పుస్తకంలో మీరు అర్థం చేసుకోలేకపోయిన లేదా స్పష్టత కావాలసిన అంశాలు ఉంటే, దయచేసి మీ ప్రశ్నలు లేదా సూచనలను ఈ ఈ-మెయిల్ కు పంపవచ్చు: **storybooks.feedback@gmail.com**


# మాస్టర్ సి.వి.వి.

మాస్టర్ సి.వి.వి. ఒకసారి ప్రముఖ ఆంగ్ల దినపత్రికల 'ది హిందూ'లో "మరణాన్ని దాటగోరువారు సంప్రదించగలరు" అని ప్రకటననిచ్చారు. కుంభరాశి చైతన్యాన్ని భూమిపైకి తీసుకువచ్చి, దాని సహాయంతో గ్రహగతులను చక్కజేశారు. శిష్యులు కాంతిమయ శరీరాన్ని పొందేలా సహాయపడ్డారు.

అటువంటి కాంతిమయ బంగారు శరీరంతో రోగం, మరణం వంటి శారీరక పరిమితులను అధిగమించడం సాధ్యమని, తమ శరీరాన్ని వదిలి కొన్ని రోజుల తర్వాత తిరిగి జీవించటం ద్వారా వారు నిరూపించారు. భృక్త రహిత తారక రాజయోగ మార్గాన్ని మానవాళికి అందించారు.

---

## ఈ సిరీస్‌లోని ఇతర పుస్తకాలు







ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ - గ్లోబల్, స్విట్జర్లాండ్.